క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్: న్యూ కాలనీ, దత్తసాయినగర్, శ్రీలా గార్డెన్, లోటస్ కాలనీ, మియాపూర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ హరిసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు న్యూ కాలనీ ఫీడర్ పరిధిలోని లక్ష్మీనగర్, న్యూ కాలనీ, దత్తసాయినగర్ ఫీడర్ పరిధిలో బాలాజీనగర్, లక్కీ రెస్టారెంట్ బ్యాక్ సైడ్ ఏరియా, దత్తసాయి కాలనీ, శ్రీలా గార్డెన్ ఫీడర్ పరిధిలో నడిగడ్డతండా, సత్యనారాయణ ఎన్‌క్లేవ్ అదే విధంగా.. లోటస్ కాలనీ, మియాపూర్ ఫీడర్ పరిధిలో అంగర రెస్టారెంట్, సత్య కళ్యాణ అపార్ట్‌మెంట్, ఆర్‌టీఐ దేవల పర్, లేక్ వ్యూ, శారద స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ఉచిత వైద్య, రక్తదాన శిబిరం

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ హఫీజ్‌పేట్‌లో బీఎల్‌వై చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య, రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శిబిరం ఉంటుందని, న్యూరాలజిస్ట్, జనరల్ ఫిజీషియన్ వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు కూడా అందజేస్తారన్నారు. రక్తదానం చేయాలనుకునే వారు కూడా ఓల్డ్ హఫీజ్‌పేట్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఇవ్వవచ్చని బీఎల్‌వై చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పేర్కొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో 18 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించిందని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 18 మంది పట్టుబడగా వారిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 16 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున, మరో ఇద్దరికి రూ.3 వేలు జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

పటాన్‌చెరుకు వార్డు కార్యాలయం మంజూరు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ కు ఒక కోటి యాభై లక్షల అంచనా వ్యయంతో నూతన వార్డు కార్యాలయం మంజూరైన సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి,జోనల్ కమిషనర్ శంకరయ్యకు, అధికారులకు పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నూతన కార్యాలయం మంజూరు కావడంపై హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ ఎస్‌ఈ శంకర్, డిప్యూటీ కమిషనర్ బాలయ్య, ఏఈ శివకుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత



ఫోన్ అందజేస్తున్న సీఐ తిరుపతిరావు, డీఐ కాంతారెడ్డి

మియాపూర్: పోగొట్టుకున్న ఫోన్‌ను కనిపెట్టి యజమానికి అందజేశారు మియాపూర్ పోలీసులు .పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హఫీజ్‌పేట్‌లోని సాయినగర్ కాలనీకి చెందిన అబుబక్‌ర్ బీన్ అహ్మద్ అనే వ్యక్తి ఈ నెల 14వ తేదీన తన ఇంటి సమీపంలో రెడ్‌మీ 9ఏ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. వెంటనే సీఈఐఆర్‌లో ఫోన్ పోయినట్లు అప్‌లోడ్ చేశాడు. దీంతో మియాపూర్ పోలీసులు ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రార్ వెబ్ అప్లికేషన్ ద్వారా మొబైల్‌ను ట్రేస్ చేసి సీఐ తిరుపతిరావు, డీఐ కాంతారెడ్డిలు ఆ ఫోన్‌ను అహ్మద్‌కు అందజేశారు.

ముగిసిన క్రీడా, సాంస్కృతిక పోటీలు



రాయదుర్గం: మనూలో జీ-20 యూనివర్శిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన క్రీడా పోటీలు ముగిశాయి. డైరెక్టరేట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ హాస్టళ్ల పోటీల్లో బాలుర హాస్టల్స్-2 క్రికెట్ విజేతగా నిలిచింది. బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో బీహెచ్-4, బ్యాడ్మింటన్ డబుల్స్ బీహెచ్-1 గెలుచుకుంది. వాలీబాల్, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్‌లో బాయ్స్ హాస్టల్-2 విజేతగా నిలిచింది. క్యారమ్స్ సింగిల్స్, డబుల్స్ విజేతగా కూడా హాస్టల్-2 గెలుచుకుంది. కాగా చెస్ పోటీలో ఎం.డీ అర్సలాన్ విజేతగా, బైట్‌బాజీలో హాస్టల్-2 , క్విజ్‌లో బాలుర హాస్టల్-3 విజేతగా నిలిచింది.

భళా.. విద్యార్థుల కళ

















అందరినీ ఇట్టే ఆకట్టుకునే రీతిలో పలు రకాల ఆకృతులను తయారు చేసి ప్రదర్శించారు. భళా అనిపించారు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, ఎస్ఎన్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్‌లో మాస్టర్స్ ఇన్ ఫైన్ ఆర్ట్స్ (ఎంఎఫ్ఏ) ఫైనల్ ఇయర్ విద్యార్థులు. వారు తయారు చేసిన వివిధ కళాఖండాలతో వార్షిక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో 23 మంది విద్యార్థులు తయారు చేసిన కళాత్మక ఆకృతులను ప్రదర్శించారు. 2వేల మంది సందర్శకులు సైతం వీక్షించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆర్టిస్ట్ డీఎల్ఎన్‌రెడ్డిని గౌరవించారు. – రాయదుర్గం

భానూర్‌లో రైతుల ధర్నా



ఆందోళన చేస్తున్న రైతులు

- గోనె సంచులు, రవాణా సౌకర్యం లేకపోవడంతో తడిసిన ధాన్యం
- ధాన్యాన్ని కాల్చేసిన రైతులు

పటాన్‌చెరు టౌన్: సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు చేసి ఉంటే తమకు ఈ ఇబ్బందులు ఉండేవి కాదని, గోనె సంచులు, రవాణా సౌకర్యం లేకపోవడంతో రాత్రి కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసిపోయిందని భానూర్ గ్రామ రైతులు వాపోయారు .సోమవారం పటాన్‌చెరు మండలం భానూర్ గ్రామ రహదారిపై రైతులు టైర్లు, ధాన్యాన్ని కాల్చి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో తాము నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

తెలుగు సాహిత్యానికి తీరని లోటు

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

రాయదుర్గం: ప్రముఖ కథారచయిత, అధ్యాపకులు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి మృతితో తెలుగు సమాజం ఉత్తమ విద్యావేత్త, కథారచయితను కోల్పోయిందని హెచ్‌సీయూ తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన సుదీర్ఘకాలం పాటు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో పనిచేశారని గుర్తు చేశారు. ఆ సమయంలో బీఏ, ఎంఏ తెలుగు విద్యార్థులకు ఎన్నో ఉత్తమమైన పాఠ్యాంశాలను రూపకల్పన చేశారన్నారు. ఆయన అనేక కథలు రాశారని, జప్తు, ఇచ్చాగ్ని, కేతు విశ్వనాథరెడ్డి కథలు పేర్లతో కథా సంపుటాలుగా కూడా ఆయన కథలు వెలువడ్డాయన్నారు. ఆయన మరణం తెలుగు సాహిత్య లోకానికి తీరని లోటని పేర్కొన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో గ్రామీణ రహదారుల నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించడంతోపాటు, గ్రామాల మధ్య అంతర్గత రహదారుల నిర్మాణాలు చేపడుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్ సౌజన్యంతో కోటిఇరవై లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే నిధులతో పాటు వివిధ పరిశ్రమలు, నిర్మాణరంగ సంస్థల సీఎస్ఆర్ నిధులతో శరవేగంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాలలో సీసీ రోడ్లు నిర్మించడంతోపాటు, మౌలిక వసతులు కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాలమణి శ్రీశైలం, మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, ఎంపీటీసీ శ్రీశైలం, ఉపసర్పంచ్ శోభ, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, మాణిక్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, బండరాజు, నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

మియాపూర్: అత్తతో గొడవపడి మనస్తాపం చెందిన మహిళ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మియాపూర్ ఎస్ఐ రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం..కర్ణాటక రాష్ట్రానికి చెందిన నర్సింహారెడ్డి, సుగుణకు 8 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. మియాపూర్‌లోని మక్తమహబూబ్‌పేట్‌లో ఉంటూ స్థానికంగా కూలీ పనులు చేసుకుంటున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. గత కొంతకాలంగా సుగుణ మద్యానికి అలవాటు పడింది. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో తాగిన మత్తులో అత్త నర్సమ్మతో వంట విషయంలో గొడవ పడ్డారు. దీంతో ఇంటి సమీపంలో ఉన్న మక్త చెరువులో దూకింది. అక్కడ స్థానికులు సుగుణ చెరువులో దూకడం చూసి భర్త నర్సింహారెడ్డికి తెలుపగా అతను మియాపూర్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు, జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. తెల్లవారి సాయంత్రం 4 గంటలకు మృతదేహం పైకి తేలింది. దీంతో డీఆర్ఎఫ్ సిబ్బంది మృతదేహాన్ని చెరువులో నుండి బయటకు తీశారు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ మళ్లింపు .. ఉన్నతాధికారుల పరిశీలన



ట్రాఫిక్ మళ్లింపు ప్రాంతాలలో పర్యటిస్తున్న సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ నారాయణ్‌నాయక్, ఇతర అధికారులు

గచ్చిబౌలి: ట్రాఫిక్ మళ్లింపుపై జీహెచ్ఎంసీ, సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా సోమవారం గచ్చిబౌలిలోని పలు ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ నారాయణ్‌నాయక్ మాట్లాడుతూ సైబరాబాద్ పరిధిలోని గచ్చిబౌలి జంక్షన్ నుంచి కొండాపూర్ రహదారి వైపు ఫ్లైఓవర్ నిర్మాణ పనుల నిమిత్తం ట్రాఫిక్ మళ్లించామన్నారు. జీహెచ్ఎంసీ శిల్పా లే అవుట్ ఫేజ్-2 ఫ్లైఓవర్ నిమిత్తం గచ్చిబౌలి జంక్షన్ నుంచి కొండాపూర్ రోడ్డు వరకు 90 రోజులపాటు అంటే ఆగష్టు 10వ తేదీ వరకు పనులు సాగుతాయన్నారు.

- ఓఆర్ఆర్ నుంచి హఫీజ్‌పేట్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను గచ్చిబౌలి జంక్షన్ ద్వారా శిల్పా లేఅవుట్ ఫ్లైఓవర్ మీదుగా మీనాక్షి టవర్స్, డెలాయిట్, ఏఐజీ ఆస్పత్రి, క్యూమార్ట్, కొత్తగూడ ఫ్లైఓవర్, హఫీజ్‌పేట్‌కు వెళ్ళే విధంగా ఏర్పాటు చేశారు.
- లింగంపల్లి నుంచి కొండాపూర్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను గచ్చిబౌలి ట్రాఫిక్ పీఎస్-డీఎల్ఎఫ్ రోడ్డు, రాడిసన్ హోటల్, కొత్తగూడ మీదుగా కొండాపూర్ వద్ద మళ్ళించబడింది.
- విప్రో జంక్షన్ నుంచి ఆల్విన్ ఎక్స్ రోడ్డు వైపు వచ్చే ట్రాఫిక్ ట్రిపుల్‌ఐటీ జంక్షన్ వద్ద మళ్ళించడుతుంది. ఎడమ మలుపు గచ్చిబౌలి స్టేడియం యూటర్న్ తీసుకొని డీఎల్ఎఫ్ రోడ్డు, రాడిసన్ హోటల్, కొత్తగూడ ఆల్విన్ ఎక్స్‌రోడ్డు వైపు వెళ్ళాలి.
- టోలిచౌకి నుంచి ఆల్విన్ ఎక్స్‌రోడ్డు వైపు వచ్చే ట్రాఫిక్ బయోడైవర్శిటీ ఫ్లైఓవర్, మైండ్‌స్పేస్ జంక్షన్ వద్ద మళ్ళించబడుతుంది. సైబర్ టవర్స్ జంక్షన్, హైటెక్స్ సిగ్నల్ వైపు ఎడమవైపు కొత్తగూడ జంక్షన్ ద్వారా వెళ్ళాలి
- టెలికామ్‌నగర్ నుంచి కొండాపూర్ వైపు వచ్చే ట్రాఫిక్ గచ్చిబౌలి వద్ద ఫ్లైఓవర్ కింద యుటర్న్ వద్ద మళ్ళించడుతుంది. బస్టాప్ పక్కన శిల్పా లేఅవుట్ ఫ్లైఓర్ మీనాక్షిటవర్స్, డెలాయిట్, ఏఐజీ ఆస్పత్రి , క్యూమార్ట్, కొత్తగూడ ఫ్లైఓవర్ ద్వారా వెళ్ళాలి.
- ఆల్విన్ ఎక్స్‌రోడ్ నుంచి గచ్చిబౌలి వైపు వచ్చే ట్రాఫిక్ కొత్తగూడ జంక్షన్ వద్ద మళ్ళించడుతుంది. హైటెక్స్ రోడ్డువైపు సైబర్‌టవర్స్, మైండ్ స్పేస్ జంక్షన్, శిల్పా లేఅవుట్ ఫ్లైఓవర్, గచ్చిబౌలి/ఓఆర్ఆర్ ద్వారా వెళ్ళాలి
- కూకట్‌పల్లి నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వెళ్లవలసిన వారు సైబర్ టవర్స్ మీదుగా ఐకియా అండర్‌పాస్, బయోడైవర్శిటీ రైట్ టర్న్ గచ్చిబౌలి మీదుగా వెళ్ళాలి, అలాగే రివర్స్ ట్రాఫిక్ అదే మార్గంలో వెళ్ళాలి
- ఆల్విన్ ఎక్స్ రోడ్డు నుంచి లింగంపల్లి వైపు వచ్చే ట్రాఫిక్ బొటానికల్ గార్డెన్ జంక్షన్ వద్ద మళ్ళించబడుతుంది. మసీదుబండ, హెచ్‌సీయూ డిపో , లింగంపల్లి ద్వారా వెళ్ళాలి
- టీహబ్ రోడ్డును ఉపయోగించుకునే విధంగా కేబుల్ బ్రిడ్జ్ కోహినూర్ హోటల్, తంగేడు రెస్టారెంటు, ఖాజాగూడ వైపునకు అలాగే రివర్స్ ట్రాఫిక్ అదే మార్గంలో వెళ్ళాలి
- ఐకియా రోటరీ వద్ద మూడు యూటర్న్‌లను సీగేట్ వద్ద ఎన్‌సీసీ ముందు అలాగే ఐకియా స్టోర్ వద్ద ఇవ్వడం జరిగింది, రోటరీ చిన్నది కావడం వలన ట్రాఫిక్ లాక్ కాకుండా చూశారు.
- హైటెక్స్ వద్ద యూటర్న్ ఏర్పాటు చేసి టెక్ మహీంద్రా, లెమన్ ట్రీ హోటల్ మీదుగా ట్రాఫిక్ రెండు వైపులా మూవ్ అయ్యే విధంగా చర్యలు తీసుకున్నారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో షాదీ ముబారక్, కల్యాణలక్ష్మీ పథకం కింద మంజూరైన ఒక కోటి నలభై ఒక లక్షల ఆర్థిక సహాయాన్ని సోమవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ 141 మంది లబ్ధిదారులకు కార్పొరేటర్‌లు రోజాదేవి రంగారావు, నార్నె శ్రీనివాసరావులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, రవీందర్ ముదిరాజ్, మాజీ కౌన్సిలర్ వీరేశం గౌడ్, వివేకానందనగర్ పార్టీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, ఆల్విన్‌కాలనీ డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, మాదాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, నాయకులు అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.



లబ్ధిదారులతో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

ఈపీటీఆర్ఐ డీజీ వాణి ప్రసాద్



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ వాణిప్రసాద్

గచ్చిబౌలి: చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ వాణీప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం గచ్చిబౌలిలోని ఈపీటీఆర్ఐ (ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రెనింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్)లో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని 'ఏ స్టెప్ టు వర్డ్స్ సస్టెయినబుల్ ఆగ్రో బయోడైవర్సిటీ' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాణి ప్రసాద్ మాట్లాడుతూ వివిధ రకాల పంటల జాతులు ఉండగా కొన్ని రకాలకు మాత్రమే అలవాటు పడటంతో మిగతా వాటి సాగు నానాటికీ తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరోగ్యానికి, మిల్లెట్స్ ఉన్న సంబంధంపై విస్తృత అవగాహన కల్పించడంతో చిరుధాన్యాలకు ప్రాధాన్యత లభించిందన్నారు. జీవన శైలిలో మార్పులు అవసరమని, ఆహారంగా చిరుధాన్యాలు తీసుకుంటే రోగ నిరోధక శక్తి పెరిగి అనారోగ్యం దరి చేరదని ఆమె పేర్కొన్నారు. జీవ వైవిధ్య వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ఈపీటీఆర్ఐ కృషి చేస్తుందన్నారు. అనంతరం చిరు ధాన్యాల ప్రదర్శన, మిల్లెట్ భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈపీటీఆర్ఐ హెచ్ఓడీ డాక్టర్ సునీల, డాక్టర్ వీరాంజనేయులు, డాక్టర్ జ్యోతి పాల్గొన్నారు.

సమస్యలు.. అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష



సమావేశంలో పాల్గొన్న జెడ్‌సీ మమత, ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు, అధికారులు

కూకట్‌పల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్, కూకట్‌పల్లి పార్టు డివిజన్‌ల పరిధిలోని పలు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సోమవారం కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో జోనల్ కమిషనర్ మమత, ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్మికుల గైర్హాజరు విషయం తన దృష్టికి వచ్చిందని, పనిచేయని కార్మికులను ఎస్ఎఫ్ఏ, ఎస్ఆర్‌పిలను వెనకేసుకురావటం సరైన విధానం కాదని హెచ్చరించారు. వివిధ ప్రాంతాల్లో శ్మశాన వాటికల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. వివేకానందనగర్, ఎల్లమ్మబండలలో నిర్మిస్తున్న శ్మశానవాటిక పనులను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. అదే విధంగా నిజాంపేటలోని మెహఫిల్ హోటల్ వద్ద నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. భీమునికుంట, అలీతలాబ్, ఎల్లమ్మ చెరువు, అంబీర్ చెరువు, కిందికుంట చెరువుల సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రంగారావు, జీహెచ్‌యంసీ అధికారులు ఎస్ఇ చిన్నారెడ్డి, ఇఇ గోవర్ధన్, ఏఇ రాజీవ్, శివప్రకాష్, శ్రావణి, ఆశ, టౌన్‌ప్లానింగ్ సిటీ ప్లానర్ ఉమాదేవి, ఏసీపీ రాణి, టీపీఎస్‌లు సోమేష్, శ్రీనివాస్, ఏఎంఓహెచ్ మమత, ఇరిగేషన్ ఏఇ విశ్వం, వీధి లైట్లు ఏఈ మృదుల, ఎస్ఆర్‌పీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న లారీ



మియాపూర్: మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆల్విన్ చౌరస్తా జాతీయ రహదారిపై ట్యాంకర్ లారీ బీభత్సం సృష్టించింది. సోమవారం మియాపూర్ ఆల్విన్ చౌరస్తా వద్ద ట్యాంకర్ లారీ (క్యూఎల్) అతి వేగంగా వచ్చి ఫ్రీ లెఫ్ట్‌లో డివైడర్లను ఢీకొంది. దీంతో అక్కడ ఉన్న వాహనదారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పటాన్‌చెరు నుంచి మియాపూర్ వైపు వెళ్తున్న రాజస్థాన్‌కు చెందిన లారీ ట్యాంకర్ క్యూఎల్ లోడుతో వెళ్తోంది. ఈ క్రమంలో మియాపూర్ చౌరస్తా వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ముందు భాగంలో ఉన్న చక్రాలు విరిగిపోయాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు. ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకొని వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా వాహనాన్ని తరలించారు.

వెలగని వీధిదీపాలు

అంధకారంలో కాలనీలు



అలింద్ కాలనీలో చిమ్మ చీకటి

శేరిలింగంపల్లి: వీధి దీపాలు వెలుగక అంధకారంలో మగ్గుతున్నామని శేరిలింగంపల్లి డివిజన్‌లోని సుదర్శన్‌నగర్‌వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం రాత్రి జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి జోనల్ ఆఫీస్‌కు ఎదురుగా ఉన్న సుప్రీం స్పోర్ట్స్ స్టుడియో నుంచి ఆలిండ్ కాలనీ పార్కు రోడ్డుతో పాటు, పార్కులో వీధి దీపాలు వెలగక ఇబ్బందులకు గురయ్యారు. రోడ్డుపై ఉన్న షాపుల లైటింగ్‌తోనే పాదచారులు రాకపోకలు సాగించారు. వీధిదీపాల నిర్వహణ సక్రమంగా లేదని, అధికారుల దృష్టికి తెచ్చినా ఫలితం లేదని వాపోయారు. కాలనీలో గత కొన్నాళ్ళుగా వీధిదీపాలు ఎప్పుడు వెలుగుతాయో అర్థం కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.